క్లుప్తంగా

రాజన్నదొరకు సన్మానం



రాజన్నదొరను సన్మానిస్తున్న బంగారమ్మ కాలనీ యువత, మహిళలు

సాలూరు రూరల్: సాలూరులోని బంగారమ్మ కాలనీ అభయాంజనేయ కమిటీ యువకులు, మహిళలు మంగళవారం మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొరను మంగళవారం ఘనంగా సన్మానించారు. తమకు ఎల్లవేళలా అన్ని విధాలా అండగా ఉంటూ ఆదుకుంటున్న రాజన్నదొరను సన్మానించే అవకాశం రావడం సంతోషంగా ఉందని కమిటీ యువత అభిప్రాయం వ్యక్తం చేశారు.

శక్తియాప్‌పై విద్యార్థినులు అవగాహన పెంచుకోవాలి

మక్కువ: శక్తియాప్‌పై విద్యార్థినులు అవగాహన పెంచుకోవాలని శక్తిటీమ్ హెడ్‌కానిస్టేబుల్ సీతయ్య అన్నారు. ఈ మేరకు మక్కువ మండలంలోని కోన జెడ్పీహెచ్‌ఎస్‌లో మంగళవారం శక్తిటీమ్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శక్తిటీమ్ కానిస్టేబుల్ కమలాకరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెత్తనుంచి సంపద తయారీకి సిద్ధం చేయాలి

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో ఉన్న ఎస్‌డబ్ల్యూపీసీల్లో చెత్తనుంచి సంపద తయారీకి క్లాప్ మిత్రలు సిద్ధం చేయాలని డిప్యూటీ ఎంపీడీఓ కె.కుమారవర్మ అన్నారు. ఈ మేరకు కాశీపేట సచివాలయం పరిధిలో ఉన్న ఎస్‌డబ్ల్యూపీసీలో ఎర్రల తయారీ, ఎరువుతయారీని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్నిగ్రామాల్లో నిర్మాణాలు చేసిన చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాల్లో ఎరువులు తయారుచేసి పంచాయతీల ఆర్థికాభివృద్ధికి క్లాప్‌మిత్రలు కృషి చేయాలని కోరారు.

నోబుల్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మట్టి విగ్రహాల పంపిణీ



మట్టి వినాయకులను పంపిణీ చేస్తున్న నోబుల్ వాకర్స్ క్లబ్ సభ్యులు

పార్వతీపురం టౌన్: పార్వతీపురం నోబుల్ వాకర్స్ క్లబ్ సభ్యుల ఆధ్వర్యంలో మంగళవారం నెయ్యిల వీధి కూడలి వద్ద ఉచిత మట్టి విగ్రహాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు, వైస్ చైర్మన్ యిండుపూరు గున్నేశ్వరరావు మాట్లాడుతూ మట్టి విగ్రహాల వాడకం వల్ల వాతావరణం ఎటువంటి కాలుష్యం అవదని, మట్టి విగ్రహాలు వాడి పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ నారాయణస్వామి, దుర్గా సీతారాం తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

పాచిపెంట: మండలంలోని పి.కోనవలస గ్రామంలో సోమవారం రాత్రి వీచిన గాలులకు చెట్టు విరిగి విద్యుత్ స్తంభంపై పడగా విద్యుత్ స్తంభం నేలకొరిగింది. స్థానికుల సమాచారం మేరకు వెంటనే అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. మంగళవారం కొత్త విద్యుత్‌స్తంభాన్ని వేసి గ్రామంలో విద్యుత్ సేవలు పునరుద్ధరించారు.

సాగు భూములకు పట్టాలివ్వాలి

పాచిపెంట: ఏళ్ల తరబడి గిరిజనులు సాగు చేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యుడు జన్ని రామయ్య అన్నారు. ఈ మేరకు మండలంలోని తోకమెట్ట గ్రామంలో మంగళవారం స్థానిక గిరిజనులతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాతల కాలం నుంచి గిరిజనులు సాగు చేస్తున్న భూములకు రెవెన్యూ అధికారులు పట్టాలు ఇవ్వకుండా తాత్సారం చేస్తున్నారన్నారు. పట్టాలు లేక గిరిజన రైతులు ప్రభుత్వ సబ్సిడీని కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి గిరిజనులు సాగు చేస్తున్న భూములకు పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకుడు కొర్ర కల్యాణ్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పి.రమేష్, పోతినాయుడు తదితరులు పాల్గొన్నారు.

మడిగట్లపై కందిపంటతో ప్రయోజనం

సీతానగరం: మండలంలో వరిచేను మడిగట్లపై కంది పంట వల్ల అది ఎర పంటగా ఉపయోగపడి చీడ పీడలు అదుపులోకి వస్తాయని, అదనంగా దిగుబడి పెంచడానికి దోహదపడుతుందని ఏఓ ఎస్ అవినాష్ అన్నారు. ఈ మేరకు అంటిపేటలో మడిగట్లపై రైతుల సహకారంతో కందివిత్తనాలు మంగళవారం ఆయన నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కంది పంట దిగుబడికి ఎంతగానే ఉపయోగపడుతుందన్నారు. నానో యూరియా 500 ఎంఎల్ మందుద్రావణాన్ని పురుగు మందులో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు లక్ష్మణ్, జగదీష్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

వచ్చాడయ్యా స్వామి..!



వివిధ రూపాల్లో తొలిపూజలకు సిద్ధంగా ఉన్న గణనాథులు

- నేడు కొలువుదీరనున్న గణనాథులు
- చవితి ఉత్సవానికి సిద్ధమైన మంటపాలు

పార్వతీపురం రూరల్:

చవితి సంబరాలకు ఊరూవాడా సిద్ధమైంది. ఇప్పటికే జిల్లాలోని పల్లె, పట్టణ ప్రాంతాల్లో చవితి ఉత్సవాలను ఉత్సాహంగా నిర్వహించేందుకు కమిటీ సభ్యుల నేతృత్వంలో మంటపాలు సిద్ధమయ్యాయి. ఈ మంటపాల్లో బుధవారం ఉదయం తొలి పూజతో గణనాథుడు వివిధరూపాల్లో కొలువుదీరి భ భక్తులకు దర్శనమివ్వనున్నాడు. ఇప్పటికే అడ్వాన్సులు ఇచ్చి ఉత్సవ కమిటీ ఎంచుకున్న రూపం గల గణనాథులను మూడు రోజులుగా తయారీ కేంద్రాల నుంచి ట్రాక్టర్లు, ఆటోలు, తోపుడు బళ్లు, గూడ్స్ వాహనాలపై జయ జయ ధ్వానాలతో ఉత్సాహంగా వారి ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇప్పటికే సింగిల్ విండో గణేష్ ఉత్సవ్ వెబ్‌సైట్ ద్వారా మంగళవారం సాయంత్రం వరకు పార్వతీపురం, పాలకొండ పోలీస్ సబ్‌డివిజన్లకు సంబంధించి 12116 మంటపాలకు అనుమతులు ఇచ్చినట్లు పోలీసు అధికారులు చెబుతున్నారు. బుధవారం ఉదయానికి మరిన్ని అనుమతులకు



వినాయకుని ప్రతిమతో చిన్నారి

దరఖాస్తులు అందనున్నట్లు తెలియజేస్తున్నారు.

సిద్ధమైన మంటపాలు

బాలగణపతి, బొజ్జ గణపతి, ఉండ్రాళ్ల గణపతి, ఏకదంత గణపతి, పార్వతీతనయ గణనాథుని ఉత్సవాలను నిర్వహించేందుకు ఇప్పటికే ఊరూవాడా వేదికలుగా మారి చిన్నా, పెద్దా ఉత్సవ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే అడ్వాన్స్‌ల పేరిట కొంతమొత్తాన్ని చెల్లించి తాము కోరుకున్న విధంగా గణనాథుల ప్రతిమలను తయారు చేయించుకుని మంటపాల దిశగా బయలు దేరుతున్నారు. ఈ మేరకు రూ.10వేల నుంచి లక్షల రూపాయలు ఖరీదు చేసే విఘ్నేశ్వరుని విగ్రహాలకు భక్తిశ్రద్ధలతో పూజలందించేందుకు కొనుగోలు చేసి మంటపాల్లో కొలువుదీర్చనున్నారు. అలాగే అక్కడక్కడా పర్యావరణానికి ప్రాధాన్యం ఇస్తూ హరిత గణపతి ప్రతిమలను వివిధ రూపాల్లో మట్టితో, జొన్న కంకులతో యువత తమ నైపుణ్యాన్ని చూపిస్తూ మంటపాల్లో గణనాథులను ప్రత్యేక ఆకర్షణతో కొలువుదీర్చేందుకు సిద్ధమవుతున్నారు.



పార్వతీపురం మండలం డెప్పివలసలో కొబ్బరి కొమ్మలతో సిద్ధం చేసిన చవితిమంటపం



సంగంవలసలో సిద్ధమైన మంటపం

తొమ్మిదిరోజులకు మించరాదు



మంగళవారం సాయంత్రం 4:32గంటల నుంచే చవితి వస్తున్న నేపథ్యంలో బుధవారం ఉదయం 4:30 గంటల నుంచి మధ్యాహ్నం 3:20గంటల వరకు సిద్ధివినాయక పూజలు చేయడానికి శుభప్రదంగా చవితి శుభముహూర్తం ఉంది. అయితే ఈ సంవత్సరం భాద్రపద శుద్ధ పౌర్ణమి నేపథ్యంలో వచ్చే నెల 7న ఆదివారం రాత్రి సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా గ్రహణ సమయంలో గణనాథుని నవ రాత్రులు ఉంచకూడదు. ఈ మేరకు బుధవారం ప్రారంభమైన చవితి నవరాత్రులు శుక్రవారం సెప్టెంబర్ 5 నాటికి పూర్తికాగా ఎట్టి పరిస్థితుల్లో సెప్టెంబర్ 6వ తేదీలోపే గణపతి మంటపాలు ఉద్వాసన చేసి గణనాథులను భక్తి శ్రద్ధలతో నిమజ్జనం చేయాలి. తొలిపూజను అందుకోనున్న విఘ్నేశ్వరుని పూజలో పెద్ద, చిన్న తేడా లేకుండా కుటుంబ సమేతంగా పాల్గొనడం శుభ్రప్రదం.

– ప్రముఖ నాడీ జ్యోతిష్యుడు మురపాక కాళిదాసు శర్మయాజీ, శ్రీ విద్యా సర్వమంగళాదేవి పీఠాధిపతి, పార్వతీపురం



వాహనాలపై మంటపాలకు విఘ్నేశ్వరుని విగ్రహాలను తరలిస్తున్న యువత

ఎరువుల పంపిణీ ప్రకటనకే పరిమితం

సీతానగరం: రైతుల డిమాండ్‌ను బట్టి ప్రభుత్వం ఎరువులు సమకూర్చక పోవడంతో ఎరవుల కోసం రైతులు వ్యవసాయపనులు విడిచి కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని సీపీఎం జిల్లా నాయకుడు రెడ్డి వేణు అన్నారు. ఈ మేరకు మండలకేంద్రంలో మంగళవారం సీపీఎం మండల కార్యదర్శి ఆర్.ఈశ్వరరావు, కమిటీ సభ్యుడు జీవీ రమణతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ మాది రైతు ప్రభుత్వమని చెప్పి అధికారంలోకి వచ్చిన చంద్రబాబునాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వంలో రైతులకు కష్టాలు మొదలయ్యాయని ఆరోపించారు. పొలాల్లో పంటల సాగుకు అవసరమైన ఎరువులు సమకూర్చకపోవడం వల్ల రైతులు పొలం పనులు విడిచిపెట్టి ఎరువుల కోసం రైతుసేవాకేంద్రాలు, పీఏసీఎస్‌లు, లైసెన్స్‌డ్ ఎరువుల షాపుల చుట్టూ తిరగాల్సి వస్తోందన్నారు. జిల్లాలో ఎరువుల కొరత లేదని జిల్లా ఉన్నతాధికారులు



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కమిటీ నాయకుడు ఆర్.వేణు

చేస్తున్న ప్రకటనలకు రైతుల ఆందోళనకు పొంతన లేకుండా పోతోందని, పది రోజులుగా ఎరువుల కోసం అహర్నిశలు తిరుగుతున్నారని వాపోయారు. ఇదొక్కటే కాదు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అధికారం చేపట్టిన తరువాత ఏఒక్కటీ అమలు చేసిన దాఖలాలు లేవన్నారు. ఎరువులు రైతులకు పంపిణీ చేయాలని లేని పక్షంలో ఉద్యమించక తప్పదని హెచ్చరించారు.

బాల్య వివాహాల నిరోధానికి అందరూ సహకరించాలి

సీతానగరం: బాల్య వివాహాలు నిరోధించడానికి, బాల ఆరోగ్య పరిరక్షణకు కృషి చేస్తున్న మిషన్ వాత్సల్య పథకం అమలుకు అందరూ సహకరించాలని ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఐసీడీఎస్ పీఓ, సూపర్‌వైజర్లతో మిషన్‌వాత్సల్య అవగాహన సదస్సు మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బాల్య వివాహాలు, బాల సంరక్షణ, బాల పరిరక్షణ కోసం మిషన్‌వాత్సల్య పథకం ద్వారా బాలల హక్కుల కోసం అమలు చేసిన చట్టాలు, విధులు విధానాలపై సచివాలయ మహిళాపోలీసులు, పంచాయతీ కార్యదర్శులు అవగాహన కల్పించుకుని గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు.

బాల్య వివాహాలు నిర్మూలిద్దాం


బలిజిపేట: బాల్యవివాహాలు అరికట్టేందుకు అందరు పాటుపడాలని ఎంపీడీఓ నగేష్ అన్నారు. ఈ మేరకు బలిజిపేట ఎంపీడీఓ కార్యాలయంలో మండలస్థాయి చైల్డ్ వెల్ఫేర్ ప్రొటెక్షన్ కమిటీ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ నగేష్ మాట్లాడుతూ చైల్డ్‌వెల్ఫేర్, ప్రొటెక్షన్ కమిటీ నిర్వహణ, బాధ్యతలు, పోక్సో యాక్ట్, గృహహింస తదితర అంశాలను వివరించారు. బాల్యవివాహాలను నిర్మూలించేందుకు అందరం పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ పుష్పారావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



బలిజిపేట: ఎంపీడీఓ కార్యాలయంలో ప్రతిజ్ఞచేస్తున్న అధికారులు, సిబ్బంది

దండాలయ్యా.. ఉండ్రాళ్లయ్యా

సాలూరు: వినాయకచవితి నేపథ్యంలో పట్టణంలోని వీధులు శోభను సంతరించుకున్నాయి.కుమ్మరివీధి నుంచి వినాయక విగ్రహాలను తమ గ్రామాలకు తీసుకువెళ్లేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు వివిధ వాహనాల్లో తరలివచ్చారు.చిన్న పరిమాణం నుంచి భారి పరిమాణం వరకు పూజలందుకునేందుకు వినాయక విగ్రహాలు సిద్ధమయ్యాయి.మరోవైపు వినాయక ఉత్సవానికి మంటపాల వద్ద ప్రత్యేక డెకరేషన్‌లు, పూజాసామగ్రి, తమ ఇండ్ల వద్ద వినాయకచవితికి సంబంధించిన పూజాసామగ్రి కొనుగోలు తదితర పనుల కోసం పట్టణానికి అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. దీంతో పట్టణంలో ఆధ్యాత్మికతతో కూడిన సందడి వాతావరణం నెలకొంది. పట్టణంలో మంత్రి సంధ్యారాణి చేతుల మీదుగా మట్టి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు.



విక్రయానికి సిద్ధంగా ఉన్న విగ్రహాలు



రద్దీగా ఉన్న సాలూరు మెయిన్ రోడ్డు

వినాయక మంటపాన్ని ప్రారంభించిన రాజన్నదొర



వినాయక మంటపాన్ని పారంభించిన నమస్కరిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర

సాలూరు రూరల్: పట్టణంలోని బంగారమ్మ కాలనీలో అభయాంజనేయ ఆలయం పక్కన నిర్మాణం చేసిన వినాయక మంటపాన్ని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర మంగళవారం ప్రారంభించారు. అభయాంజనేయ యువజన కమిటీ ఆధర్యంలో నిర్మాణం చేసిన శాశ్వత వినాయకుడి మంటప గదికి రాజన్నదొర ఆర్థిక సహాయం చేశారని ఆయన, ఆయన శిష్యుల సహకారంతో మంటప గది నిర్మాణం చేయగలిగామని బంగారమ్మ కాలనీ యువకులు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వంగపండు అప్పల నాయుడు, గిరిరఘు, గొర్లె మంధు, బంగారమ్మ, మహిళా నాయకురాలు రమాబాయి, కాలనీ యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అగ్గి తెగులు నివారణపై రైతులు దృష్టి పెట్టాలి

పాచిపెంట: వరి నారుమడుల్లో అగ్గి తెగులు నివారణపై రైతులు దృష్టి పెట్టాలని మండల వ్యవసాయ శాఖ అధికారి కె. తిరుపతిరావు సూచించారు. ఈ మేరకు మంగళవారం పాచిపెంట మండలంలోని పి.కోనవలసలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా వరి నారుమడిని ఆయన పరిశీలించారు. నారు ఉడిచిన పొలాల్లో అగ్గి తెగులును గుర్తించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిరుజల్లులు, మబ్బుల వాతావరణం ఎక్కువగా ఉన్నప్పుడు, అధిక యూరియా వేసినప్పుడు అగ్గి తెగులు ఆశిస్తుందన్నారు. అగ్గి తెగులు ఆకులపై కన్ను ఆకారపు మచ్చలను ఏర్పరుస్తుందని నివారణకు ఒక లీటర్ నీటికి సాఫ్ లేదా ట్రై సైకలాజోల్ లేదా అజాక్సిస్ట్రోబిన్ మిల్లీమీటర్ ముందును కలిపి పిచికారీ చేసుకోవాలని లేదా సూడోమోనాస్ మందును చేను బాగా తడిచేలా పిచికారీ చేసుకోవడం ద్వారా అగ్గి తెగులును నివారించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఏపీసీఎన్ఎఫ్ సీఆర్పీ విజయ్ వీఏఏ లావణ్య పాల్గొన్నారు.

ఎరువుల పంపిణీలో జిల్లా యంత్రాంగం విఫలం

పార్వతీపురం రూరల్: ఎరువుల పంపిణీలో జిల్లాయంత్రాంగం విఫలమైందని కాంగ్రెస్‌పార్టీ నాయకులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ మేరకు పార్వతీపురం మండలంలోని బాలగుడబ గ్రామంలో మంగళవారం పర్యటించి రైతులను యూరియా సరఫరాపై ఆరాతీసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ నేపథ్యంలో బాలగుడబ గ్రామానికి 1000 బస్తాల యూరియా అవసరమైతే నేటికి రెండు విడతలుగా 526 బస్తాలు పంపిణీ చేసినట్లు రైతులు తెలిపారన్నారు. పుష్కలంగా ఎరువులు ఉన్నాయని ప్రకటనలు గుప్పిస్తున్న అధికారులు, పాలకులు క్షేత్రస్థాయిలో యూరియా దొరకక రైతులు అవస్థలు పడుతున్న దుస్థితిని గమనించాలన్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌కు అనుకూల వర్షాలు లేక ఆలస్యంగా ఉభాలు పూర్తిచేస్తే పూర్తయిన ఉభాలకు యూరియా జల్లేందుకు రైతులు యాతన పడుతున్నట్లు పల్లెల్లో స్పష్టంగా కనిపిస్తోందన్నారు. జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో వర్షం లెక్క చేయకుండా పడిగాపులు కాసినా యూరియా దొరకని పరిస్థితులు నెలకొన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే కృత్రిమ కొరత సృష్టిస్తున్న వారిపై చర్యలు కానరావడం లేదన్నారు.

యూరియా కోసం బారులు తీరిన రైతులు



మామిడిపల్లి రైతు సేవా కేంద్రం వద్ద యూరియా కోసం బారులు తీరిన రైతులు

సాలూరు రూరల్: మండలంలోని మామిడిపల్లి రైతు సేవా కేంద్రవద్ద మంగళవారం యూరియా కోసం రైతులు ఉదయం నుంచి బారులు తీరారు. సచివాలయం పరిధిలో 300 మందికి పైగా రైతులు ఉన్నారు. వారికి సరిపడా యూరియా స్టాక్ రాకపోవడంతో అందుతుందో లేదోనని ఉదయం నుంచి క్యూలో వేచిఉండాల్సి వచ్చింది. చివరికి కొంతమంది రైతులు యూరియా లేక వెనుదిరిగారు.

వెంగాపురంలో..

బలిజిపేట: ఒక యూరియా బస్తాకు అష్టకష్టాలు పడాల్సిన పరిస్థితులు రైతులకు ఎదురవుతున్నాయి. మొన్న బలిజిపేటలో అయితే మంగళవారం వెంగాపురంలో రైతులు ఈ దుస్థితి ఎదుర్కోవలసి వచ్చింది. వెంగాపురం రైతు సేవాకేంద్రానికి 222బస్తాల యూరియా రావడంతో విషయం తెలుసుకున్న రైతులు పరుగులు తీసి క్యూ కట్టారు. ఎవరికి అందుతుందో ఎవరికి అందదో అనే ఆతృతతో పడిగాపులు పడ్డారు. ఒక రైతుకు ఒక బస్తా వంతున ఉన్నంత వరకు రైతులకు వ్యవసాయశాఖ సిబ్బంది పంపిణీ చేశారు. బస్తాలు అందక కొంత మంది రైతులు అసంతృప్తితో తిరిగారు.



బలిజిపేట: వెంగాపురంలో యూరియాకు అవస్థలు పడుతున్న రైతులు

కాలుష్యం నివారణకు మట్టి వినాయకులనే పూజించాలి

- స్వామి స్వాత్యానంద సరస్వతి

సీతానగరం: గణపతి నవరాత్రులను పురస్కరించుకుని ప్రతి ఒక్కరూ మట్టితో తయారుచేసిన వరసిద్ధి వినాయక విగ్రహాలకే పూజలు చేయాలని స్వామి స్వాత్యానంద సరస్వతి అన్నారు. ఈ మేరకు మండలంలోని ఎల్‌వీఆర్ స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకుడు కంకణాల పల్లి అరవింద్‌కుమార్ సమకూర్చిన నిధులతో మట్టితో తయారుచేసిన 1000 వినాయక విగ్రహాలను స్వామి స్వాత్యానంద సరస్వతి చేతుల మీదుగా మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ భక్తునికి, భగవంతునికి ప్రీతికరమైన మట్టితో తయారుచేసిన విగ్రహాలను వితరణ చేయడం అభినందనీయమన్నారు. పూజల్లోకెల్లా మొదటి పూజ గజాననుడికే వర్తిస్తుందని ప్రజలు భక్తి ప్రపత్తులతో పూజలు నిర్వహించుకోవాలని సూచించారు. ఎల్‌వీఆర్ సంస్థ వ్యవస్థాపకుడు అరవింద్ కుమార్‌ను అభినందించారు. కార్యక్రమంలో కేబుల్‌నెట్‌వర్క్ ప్రతినిధి సీహెచ్‌వీ గోపాలకృష్ణ, ఆర్యవైశ్య సంఘం జిల్లాప్రధాన కార్యదర్శి ఎం.విశ్వేశ్వరరావు, కె.లక్ష్మణరావు, పెంటసత్యం, ఆర్.వేణుగోపాల్ సంస్థ సభ్యులు పాల్గొన్నారు.



వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న స్వామి స్వాత్యానంద సరస్వతి

2,600లీటర్ల ద్రవ జీవామృతం తయారీ

బలిజిపేట: మండంలోని మిర్తివలసలో ఎస్.శ్రీనివాసరావు బయో రిసోర్స్ ఇన్‌పుట్ సెంటర్ వద్ద 2,600లీటర్ల ద్ర జీవామృతం తయారుచేసినట్లు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తిరుపతిరావు మంగళవారం తెలిపారు. దీని తయారీకి 260కిలోల ఆవు పేడ, 260లీటర్ల గోమూత్రం, 26కిలోల బెల్లం, 26కిలోల శనగపిండి, 6కిలోల పుట్టమన్ను తీసుకుని వాటిని గోమూత్రంలో కరగదీసి నీటిలో పోసుకున్న తరువాత వారం రోజుల పాటు ఉదయం, సాయంత్రం సవ్య దిశలో కలుపుకోవాలన్నారు. ద్రవ జీవామృతాన్ని పంట పొలాల్లో వినియోగించడం వల్ల భూమిలో అన్ని రకాల సూక్ష్మజీవులు వృద్ధి చెంది పంటకు కావలసిన అన్ని రకాల సూక్ష్మ పోషకాలు లభిస్తాయన్నారు. దీనివల్ల అధిక దిగుబడి పొందవచ్చన్నారు. రైతులు దీనిని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.



మిర్తివలసలో బయోఇన్‌పుట్ సెంటర్ వద్ద జీవామృతం తయారుచేస్తున్న సిబ్బంది

గ్రీన్ అంబాసిడర్ల ధర్నా

బలిజిపేట: గ్రీన్ అంబాసిడర్లకు నెలల తరబడి జీతం బకాయిలు పేరుకుపోవడంతో బలిజిపేట మండల గ్రీన్ అంబాసిడర్లు రోడ్డెక్కారు. బకాయి జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ మండల అధ్యక్షుడు పృథ్వి, సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి మన్మథరావులు మాట్లాడుతూ ఇచ్చిన రూ.6వేల జీతం ఏ నెలకు ఆనెల ఇవ్వకుండా వాటిని బకాయిలు పెడుతుంటే కుటుంబాలను ఏవిధంగా పోషించుకోవాలని ప్రశ్నించారు. గ్రామంలో చెత్తను సేకరించడం, అధికారులు, ప్రజాప్రతినిధులు వచ్చినప్పుడు గ్రామాల్లో బ్లీచింగ్ జల్లడం, ఇతరత్రా అదనపు పనులు చేస్తున్నామని, దుర్గంధం వెదజల్లుతున్నా తడిచెత్త, పొడిచెత్తలను వేరువేరుగా సంపద తయారీకేంద్రాల వద్దకు తీసుకువెళ్తున్నామని, రక్షణకు ఎటువంటి పరికరాలు లేకపోయినా పనులు చేస్తున్నామని వాపోయారు. ఇంతచేస్తున్నా తమకు ఇవ్వాల్సిన జీతాలను నెలనెలా ఇవ్వకుండా బకాయిలు పెట్టడం దారుణంగా ఉందన్నారు. తక్షణమే జీతాలు చెల్లించాలని, తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పకీరు, మరియమ్మ, కుమార్, ప్రకాశ్, కృపారావు తదితరులు పాల్గొన్నారు.



ఎంపీడీఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న గ్రీన్ అంబాసిడర్లు

గిరిజన సచివాలయ ఆర్‌ఎస్‌కేల్లో ఎరువుల సరఫరా ఎప్పుడు?

- సీపీఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మథరావు

పార్వతీపురం టౌన్: జిల్లాలో ఉన్న గిరిజన గ్రామ సచివాలయ ఆర్‌ఎస్‌కేల్లో ఎరువులు ఎప్పుడు సరఫరా చేస్తారని సీపీఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మథరావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ మేరకు స్థానిక సీపీఐ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లాలో అధిక శాతం గిరిజనులు ఉన్నారని, ప్రకృతి అనుకూలత వల్ల గిరిజన రైతులు బాగానే పోడు వ్యవసాయం, వరి నాట్లు వేశారన్నారు. కానీ ఇప్పటి వరకు గ్రామ సచివాలయ రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు సరఫరా జరగక అధిక డబ్బులు పెట్టి బయట వ్యాపారస్తుల దగ్గర కొనుక్కోలేక రైతులు అనేక అవస్థలు పడుతున్నారన్నారు. జులై నెలలో సరఫరా చేయాల్సిన ఎరువులు ఇప్పటివరకు సరఫరా జరపాకపోవడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారుల్లో నిర్లక్ష్య వైఖరి కనబడుతోందని ధ్వజమెత్తారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి రైతులకు వెంటనే ఎరువులు పంపిణీ చేసి ఆదుకుని రైతులపై, గిరిజనులపై ఉన్న మమకారాన్ని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో గిరిజనులు, రైతులతో కలిసి పెద్ద పోరాటాలకు శ్రీకారం చుడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.